క్లుప్తంగా

పండ్లతోటల రైతులకు ఉచితంగా నీరు


తాడిమర్రి పోలీస్‌స్టేషన్ పక్కన బోరు నీటిని చూపుతున్న పోలీసులు

తాడిమర్రి: మండలంలో పండ్లతోటల సాగు రైతుల ట్యాంకర్లకు ఉచితంగా నీటిని అందిస్తామని ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్ పక్కన ఆదివారం ఆయన బోరు బావిని తవ్వించారు. సుమారు 500 అడుగులు బోరు తవ్వగా 2 ఇంచుల నీరు పడింది. ఆయన సిబ్బందితో కలసి బోరులో మోటర్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్, పోలీసు క్వార్టర్స్ అవసరాల కోసం బోరు వేశామని, బోరులో నీరు పుష్కలంగా లభించిందన్నారు. నీటిని గ్రామ పంచాయితీ అవసరాలకు కాని మండలంలోని గ్రామాల్లో చీనీ, మామిడి, జామ, అరటి తదితర పండ్ల తోటల సాగు రైతులకు ఉచితంగా ట్యాంకర్లకు నీటిని అందిస్తామన్నారు. ఏఎస్‌ఐలు సూర్యనారాయణ రాజు, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగ గురువు నారాయణరెడ్డి దంపతులను సన్మానిస్తున్న యోగా సాధకులు

ధర్మవరం అర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం మార్కెట్‌యార్డులో యోగ గురువు గొర్ల నారాయణరెడ్డి దంపతులను యోగా సాధకులు, ఆదిగురువు ఉచిత యోగా శిక్షణ కేంద్రం సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రమణ మహర్షి ఆశ్రమంలో చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. వందలాది మందికి అన్నదానం చేశారు. కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో రమా సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం అన్నదాతలకు సన్మానం చేశారు.

సీనియర్ న్యాయవాదులకు సన్మానం


సీనియర్ న్యాయవాదులను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా సీనియర్ న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. సీనియర్ న్యాయవాదులు గురుప్రసాద్, సరిపూటి సూర్యనారాయణ, రామకృష్ణారెడ్డి, సుభద్ర, హేమ్‌కుమార్, రవీంద్రారెడ్డి, నూరుల్లా, కేఎం అతావుల్లా, హుస్సేన్‌బాషా, నారాయణ, రాంప్రసాద్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, కార్యదర్శి గోపికృష్ణ, ట్రెజరర్ అబ్దుల్‌సాబ్, ఉపాధ్యక్షుడు కరీంలు వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎంపీ సుబ్బారావు, రాఘవేంద్ర, బాలసుందరి తదితరులు పాల్గొన్నారు.

కార్నివాల్‌లో 'బెస్ట్' విద్యార్థుల సందడి


కార్నివాల్‌లో పాల్గొన్న విద్యార్థులు, యాజమాన్యం


పుట్టపర్తి అర్బన్: గోరంట్ల సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన క్యాంపస్ కార్నివాల్‌లో విద్యార్థులు సందడి చేశారు. ఇటీవల బీఎస్సీ అగ్రికల్చర్ ఫారెస్ట్రీలో విద్యా సంవత్సరం ముగిసిన విద్యార్థులు క్యాంపస్ కార్నివాల్ పేరుతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాలు, సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. దీనికి విశిష్ట అతిథులుగా విచ్చేసిన ఎస్వా సొసైటీ వ్యవస్థాపకుడు అచ్యుతరావు, సీఎస్ఈడీ డైరెక్టర్ తనుశ్రీ, ప్రొఫెసర్ సుబ్రమణ్యం, బెస్ట్ వైస్ చాన్సలర్ డాక్టర్ రాంగోపాల్ మోపూరి, డీన్ జేవియర్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ శర్మ, ప్లేస్‌మెంట్ హెడ్ రాఫెల్ జోసెఫ్, మానస ప్రసంగించారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. కమ్యూనికేషన్, గ్రూప్ డిస్కషన్స్, ప్రజెంటేషన్‌ను మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం బెస్ట్ మేనేజర్, మేక్ ఫ్రం వేస్ట్, స్టోరీ టెల్లింగ్, ఐడియా హ్యాకథాన్, పలు నాటికలు ప్రదర్శించారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు


ధర్మవరం సాయినగర్ షిరిడిసాయిబాబా ఆలయంలో బాబా పాదదర్శనం చేసుకుంటున్న భక్తులు


బాబా పాదదర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు


కదిరిలో షిర్డీ సాయినాథుని దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


కదిరిలో భక్తులకు దర్శనమిస్తున్న షిర్డీ సాయిబాబా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాయినగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమిని వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం 5గంటలకు బాబాకు కాగడా హారతి, 6 గంటలకు అభిషేకం, 7గంటల నుంచి సాయి నామ సంకీర్తన చేశారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు షిర్డీసాయిబాబా పాదదర్శనం గావించారు. షిర్డీసాయి బాబా సేవా సమితి సభ్యులు బంధనాథం సూర్యప్రకాష్, రాంప్రసాద్, హేమంత్‌కుమార్, జీసీ నాయుడు, సూర్యనారాయణ, రామలింగయ్య, వీరనారాయణ తదితరులు ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.ఇదిలా ఉండగా కొత్తపేట షిర్డీసాయిబాబా ఆలయంలో బాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కదిరి: కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని వాణివీధిలో ఉన్న సాయిబాబా ఆలయానికి తెల్లవారుజామునే భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా మహిళలు స్వామివారి దర్శనం కోసం బారులుదీరారు. స్థానిక కోనేరు సమీపంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయం సైతం భక్తులతో కిటకిటలాడింది. అక్కడ కూడా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రోజంతా బాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ప్రతి ఆలయంలోనూ ప్రత్యేక క్యూ లు ఏర్పాటు చేశారు.

బత్తలపల్లి: గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలను వివిధ రకాల పూలతో భక్తులు అందంగా అలంకరించారు. బత్తలపల్లి, రామాపురం, సంఘమేశ్వరక్షేత్రంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేసి, సామూహిక సాయి వ్రతాలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన ట్రాక్టర్‌లో గ్రామోత్సవం నిర్వహించారు. మాల్యవంతంలో అన్నదానం చేపట్టారు.

తాడిమర్రి: స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో ఆదివారం భక్తులు గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలోని బాబా విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం నిర్వహించారు.

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని సాయిబాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీరాములు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: వేపరాల సమీపంలోని షిరిడీ సాయి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేపరాల షిరిడీ సాయి ఆలయంలో సాయిబాబా విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమడగూరు: అమడగూరు, జౌకల కొత్తపల్లి గ్రామాల్లో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాయిబాబా చిత్రపటాలను ట్రాక్టర్‌పై ఉంచి, పురవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు పెద్దెత్తున కొబ్బరికాయలను సమర్పించారు. భక్తులకు ఆలయ ప్రాంగణాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. అమడగూరులో ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి, సాయి సేవాసమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తనకల్లు: తనకల్లు, కొక్కంటిక్రాస్, చీకటిమానిపల్లిలోని షిర్డీసాయిబాబా మందిరాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని సాయి మందిరాల్లో సాయిబాబా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

నల్లమాడ: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. షిర్డీ సాయిబాబా మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పలు రకాల పూజలు అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పల్లకీలో షిర్డీ సాయి బాబా విగ్రహాన్ని కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామికి కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మామిళ్లపల్లిలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఇక మండలంలోని పాతపాళ్యం గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో గురుపౌర్ణమి ఆరాధనోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక పీఠాధిపతి గురువు కుళ్లాయిరెడ్డి స్వామి, శిష్యుడు రామయ్య స్వామి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, గంగ, గోపూజలు చేపట్టారు. కార్యక్రమంలో రామప్ప, శరణప్ప స్వాముల శిష్య బృందం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రామగిరి: రామగిరితో పాటు పేరూరు, ఎంసీపల్లి, పెద్దకొండాపురం, నసనకోట, మాదాపురం కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి పంచాయతీల్లో ఆదివారం గురుపౌర్ణమి సందడి నెలకొంది. గ్రామస్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే దేవాలయాల్లో ప్రత్యేకంగా స్వామిని అలంకరించారు. రామగిరిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబాను ప్రత్యేకంగా అలంకరించి హోమం చేశారు.

ముదిగుబ్బ: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. హరిహర ఆలయంలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.


భక్తులకు అన్నదానం చేస్తున్న షిర్డీసాయిబాబా సేవా సమితి సభ్యులు


బత్తలపల్లి మండలం మాల్యవంతంలో అన్నదానం చేస్తున్న గ్రామస్తులు


అమడగూరులో షిరిడీ సాయిబాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు


తనకల్లులో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు


తాడిమర్రిలో షిర్డీసాయి బాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


వేపరాలలో పూజలందుకున్న షిరిడీ సాయిబాబా


ఎన్పీకుంటలో ప్రత్యేక అలంకరణలో షిరిడిసాయిబాబా


మామిళ్లపల్లిలో షిర్డీ సాయినాథుడు


రామగిరి: ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సాక్షి ఎఫెక్ట్..

తనకల్లు: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొక్కంటి పీహెచ్‌సీ వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు అన్నారు. సాక్షిలో ఆదివారం 'పల్లెకు జ్వరమొచ్చింది ' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి వీధులలో పేరుకుపోయిన మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఇంటింటా తిరుగుతూ జ్వర పీడితుల వివరాలను సేకరించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు అధికంగా వ్యాపించే అవకాశం ఉందన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. వారంలో మూడు రోజులు డ్రై డే పాటించాలని సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ ఓబులేసు, హెల్త్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి, ఏఎన్ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


తనకల్లు వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని జరిగిన పూజా కార్యక్రమంలో ముందుగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు ముందుగా ఆలయ ప్రదక్షిణలు చేసి, కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బాలుడి నిజాయితీ


సీఐకు ఫోన్ అందిస్తున్న బాలుడు లవన్‌కుమార్‌నాయక్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పోతుకుంట రైల్వే ఓవర్ బ్రిడ్జిపైన దొరికిన ఐఫోన్‌ను ఓ బాలుడు పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలు.. ఆదివారం ఉదయం 7 గంటలకు ధర్మవరం ఫ్లైఓవర్ బ్రిడ్జిపైన పడిపోయిన ఐఫోన్ ఆరంజ్ కలర్ బ్యాక్ పౌచ్ ఉన్న ఫోన్ పట్టణానికి చెందిన లవన్‌కుమార్‌నాయక్‌కు జాగింగ్ చేస్తుండగా దొరికింది. ఫోన్‌ను తీసుకుని వచ్చి వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యంకు అందించాడు. సీఐ ఆ బాలుడిని అభినందించారు. ఫోన్ పోగొట్టుకున్న వారు ఆధారాలతో వచ్చి తీసుకెళ్లాలని సీఐ సూచించారు.

చికిత్స పొందుతూ సీసీ మృతి

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైకేపీ సీసీ ఆనంద్ కుమార్ (35) మృతి చెందారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన మృతుడు ఆనంద్ కుమార్ చెన్నేకొత్తపల్లి మండలంలో వెలుగు సీసీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అనంతపురము నుంచి చెన్నేకొత్తపల్లికి ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా.. బస్సులో నుంచి జారి పడటంతో తీవ్రంగా గాయపడిన విషయం తెల్సిందే. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఆనంద్‌కుమార్‌ను రాత్రి అనంతపురం తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆనంద్‌కుమార్ స్వగ్రామం మామిళ్లపల్లిలో ఆదివారం సాయంత్రం జరిగిన అంత్యక్రియలకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏసీ రామేశ్వరరెడ్డి, ఏపీఎంలు, వెలుగు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మృతుడికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.


వైకేపీ సీసీ ఆనంద్‌కుమార్ మృతదేహానికి నివాళర్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ, వెలుగు సిబ్బంది

నేడు 'ప్రజా సమస్య పరిష్కార వేదిక'

బత్తలపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నా. మండలస్థాయిలో జరిగే కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

జలధికి తరలిన పీర్లు


బత్తలపల్లి మండలం ఓబుళాపురంలో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు


నిడిమామిడిలో జలధికి తరలిన పీర్లు

బత్తలపల్లి: నెత్తివారంపల్లి, ఓబుళాపురం గ్రామాల్లోని పీర్లస్వాములను ఆదివారం ఏటికి సాగనంపారు. శనివారం పెద్ద సరిగెత్తులో భాగంగా చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో పెద్ద ఎత్తున మంటలు రగిలించారు. గుండం చుట్టూ చిన్నా పెద్దా, ఆడ మగ తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అలావ్ తొక్కుతూ సంబరాలు చేసుకున్నారు. తెల్లవార్లు పీర్లను అందంగా ముస్తాబు చేసి ఆదివారం తెల్లవారుజామున గ్రామోత్సవం నిర్వహించారు. పీర్ల స్వాములకు ముజావర్లు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించిన తరువాత మూగజీవాలను బలి ఇచ్చారు. అనంతరం స్వాములను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి జలధికి తరలించారు.

ఎన్పీకుంట: మొహర్రం పండుగను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం రాత్రంతా డప్పులు వాయిస్తూ వివిధ రకాల నృత్యాలు చేశారు. తెల్లవారుఝామున ముజావర్లు, మత పెద్దలు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం అందంగా ముస్తాబు చేసిన పీర్లను డప్పు వాయిద్యాల నడుమ మండల కేంద్రంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

అమడగూరు: పూలకుంటపల్లిలో ఆదివారం పీర్ల జలధి కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. యువకులు తడి బట్టలతో పీర్లను ఎత్తుకుని, డప్పువాయిద్యాల నడుమ ఆడిపాడారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. ఇక అమడగూరులో పానకాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో జలధి

రామగిరి: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని పేరూరు, శేషంపల్లి గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులుగా ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడిలో కొలువైన పీర్ల స్వాములను ప్రత్యేకంగా ముస్తాబు చేసి అలంకరించారు. రాత్రి జరిగిన పెద్ద సరిగెత్తులో భాగంగా ఆయా గ్రామాల్లోని అగ్ని గుండాల చుట్టూ పీర్లను ఊరేగించారు. ఆదివారం సాయంత్రం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం జలధికి తరలించారు.

పుట్టపర్తి అర్బన్: నిడిమామిడి గ్రామంలో ఆదివారం మొహర్రం వేడుకలు ముగిశాయి. సాయంత్రం అగ్ని గుండ ప్రవేశం అనంతరం పీర్లు నిమజ్జనానికి తరలాయి. యువకులు వివిధ వేషధారణలతో అలావ్ తొక్కారు.

ధర్మవరం రూరల్: చిగిచెర్ల గ్రామంలో ఆదివారం గ్రామంలో జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దకాశీం స్వామి, చిన్నకాశీం స్వామి, మౌలాలిస్వామి, కుల్లాయిస్వామిను ప్రత్యేకంగా గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. గ్రామపెద్దలు కృష్ణారెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బప్పగారి ఓబిరెడ్డి భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.


ఎన్పీకుంటలో పీర్ల అగ్నిగుండ ప్రవేశం


బత్తలపల్లి మండలం ఓబుళాపురంలో అలావ్ తొక్కుతున్న గ్రామస్తులు


చిగిచెర్లలో జలధికి వెళుతున్న పీర్లు


అమడగూరులో కొలువుదీరిన పీర్లస్వాములు


పేరూరులో జలధికి తరలుతున్న పీర్లు

తైక్వాండోలో కదిరి చిన్నారి ప్రతిభ

కదిరి అర్బన్: తైక్వాండో పోటీల్లో కదిరి చిన్నారి ప్రతిభచాటింది. వివరాలు..తెలంగాణ రాష్ట్రం మాంచిర్యాలలో ఈ నెల 19 38వ తెలంగాణా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో కదిరికి చెందిన మనీష్ సబ్ జూనియర్స్ బాయ్స్ అండర్- 38 పుమ్‌సే విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ చిన్నారి పట్టణంలోని రిషిత చిన్న పిల్లల ఆసుపత్రి వైద్యుడు మదన్‌కుమార్ సోదరుని కుమారుడు.


సిల్వర్ మెడల్ సాధించిన చిన్నారి మనీష్